క్లుప్తంగా

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కమిటీ ఎన్నిక

నారాయణపేట: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జిల్లా నూతన కమిటీని సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీదింటి శివవీరారెడ్డి ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గౌని నాగేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మల్లెపల్లి సువర్ణ, మహ్మద్ మైనోద్దీన్, ప్రధాన కార్యదర్శిగా దాసరి హేమసుందర్, సంయుక్త కార్యదర్శిగా మసి పవన్, అధికార ప్రతినిధిగా కుర్వ మనోజ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పేదల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆధ్వర్యంలో తమ సంస్థ కృషిచేస్తుందని స్పష్టం చేశారు. అదేవిధంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు గౌని నాగేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి హేమసుందర్ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్రకమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అవినీతి అక్రమాలు లేని సమాజంకోసం తమ వంతుగా రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



మాగనూర్: సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని హెడ్ కానిస్టేబుల్ అర్జున్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద సైబర్‌నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ అర్జున్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యపానం సేవించి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ సీట్‌బెల్ట్ విధిగా ధరించాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి సమాచారం ఇవ్వాలి సూచించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అయోధ్యకు యువకుడి పాదయాత్ర

కృష్ణా: మండలంలోని తంగిడి గ్రామానికి చెందిన మడివాళ మహేష్ అనే యువకుడు ఆదివారం తమ గ్రామం నుంచి అయోధ్యకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆ యువకుడి యాత్ర విజయవంతం కావాలని కోరుతూ ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి సాగనంపారు.

అక్రమంగా మొరం తరలింపు



మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలో సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్ట, కాల్వ భవిష్యత్ అవసరాల నిమిత్తం మొరం కుప్పలు సమీపంలోని ఓ వ్యక్తి పొలంలో నిల్వచేసి ఉంచగా అదే అదనుగా చేసుకుని సదరు వ్యక్తి యథేచ్ఛగా మొరంతో వ్యాపారం చేస్తూ రూ. లక్షలు అర్జిస్తున్న సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొరం కుప్పలనుంచి ఇప్పటికే వందలాది టిప్పర్ల మొరం తరలిపోయిందని ఈ విషయంపై ఇరిగేషన్ సిబ్బంది మొరం తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అడ్డుకోకపోతే గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వాహిస్తామని హెచ్చరిస్తున్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న వెంకటేష్ పీయూ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆయన 'సింథసిస్ క్యారెక్టరైజేషన్ ఫోటో క్యాటలేటర్ అండ్ ఫోరో మెట్రిక్ సెన్సింగ్ స్టడీస్ ఆఫ్ జీ-సీ3ఎన్4 సపోర్టెడ్ మెటల్ ఆక్సైడ్ నానో పార్టికల్స్' అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఈమేరకు సోమవారం ఓయూ ప్రొఫెసర్ విజయలక్ష్మీ వైవాలో పరిశోధన అంశాలను వివరించారు. అనంతరం డాక్టరేట్‌ను అందజేశారు. వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజ, హెచ్‌ఓడీ చంద్రకిరణ్, కంట్రోలర్ రాజ్‌కుమార్‌లు అభినందించారు.





మరికల్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కోస్గిలో ప్రత్యేక పూజల్లో వీరశైవ సమాజం ప్రతినిధులు



మాగనూర్‌లో శోభాయాత్రలో రామభక్తులు

ఊరువాడ ఉత్సవాలు

- అయోధ్యలో బాలరాముడి ప్రతిష్టాపన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు
- ఆలయల్లో ప్రత్యేక పూజలు
- పాల్గొన్న వందలాదిమంది భక్తులు

మక్తల్: అయోధ్యలోని బాలరాముడి ప్రతిష్టాపనసందర్భంగా నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శ్రీరామనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులు పలు ఆలయాల్లో పూజలు నిర్వహించి ర్యాలీలు నిర్వహించారు. స్థానిక ఉమామహేశ్వర ఆలయంలో యువజన సంఘాల నాయకులు, కరసేవకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్‌చైర్మన్ నర్సింహాగౌడ్, రాజుల ఆశిరెడ్డి, బీంరెడ్డి, రమేష్, అంజనేయులు, కోళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

మద్దూరు: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠసందర్భంగా పట్టణంలోని పాతబస్టాండ్ అంజనేయస్వామి ఆలయం నుంచి రామాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు చేశారు. సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ వెంకటయ్య, ఉపసర్పంచ్ యాదవరెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శ్రీరాముడి చిత్రపటానికి పూజలు నిర్వహించి ఊరేగింపుగా ప్రవచన వేదిక వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు సాయిలు, భరత్, రాఘు, కాశీ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా మండలంలోని ఆయా గ్రామా ల్లోని ఆంజనేయస్వామి, రామాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీసీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలను ప్రారంభించారు. పంచామృతాభిషేకాలు నిర్వహించి గ్రామ పురవీధుల గుండా ప్రత్యేక భజనలతో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, భజరంగ్‌దళ్, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరికల్: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా సోమవారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో విద్యార్థులు స్వామివారి వేషధారణతో ప్రధాన విధుల గుండా ర్యాలీగా నిర్వహించి ఆకట్టుకున్నారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. అలాగే శ్రీరామ మందిర నిర్మాణం కోసం ప్రాణాలర్పించిన కరసేవకుల జ్ఞాపకర్థంగా సోమవారం అప్పంపల్లిలో విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు.



నర్వలో సీతారామలక్ష్మణ సమేత విగ్రహాల ఊరేగింపు

కోస్గి: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో సోమవారం ప్రతి గ్రామంలో రామనామస్మరణతో మార్మోగింది. పలు హిందూ సంస్థల ఆధ్వర్యంలో భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయగా హైందవ సమాజమంతా అయోధ్యలో జరిగిన రాములోరీ ఘట్టాన్ని ప్రత్యేక్షంగా వీక్షించారు. తెల్లవారు జాము నుంచే అన్ని ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన నిర్వహించారు. అలాగే మండల వీర శైవ లింగాయత్ సమాజం, అక్కమహాదేవి మహిళ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన చిన్నారుల వేషాధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణా: అయోధ్య రాయాలయంలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో విశిష్ట పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తాయమ్మ ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ ఆర్ వెంకటేష్, నాయకులు సంగప్పగౌడ్ మహాదేవ్, నాగేశ్వర్‌రావు, శివరాజ్‌పాటీల్, అమర్‌కుమార్ దీక్షిత్, తాయప్ప, శక్తిసింగ్, ఆంజనేయులు, నాగేష్, వీరేష్ పాల్గొన్నారు.



తీలేర్‌లో వేషధారణలతో చిన్నారుల

ఊట్కూరు: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో రామనామంతో పులకరించిపోయాయి. ఈ సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గ్రామ పురవీధుల్లో రామకీర్తన సంకీర్తన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మాగనూర్: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని ఆయా పంచాయతీలలో శ్రీరాముడి శోభయాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి నామస్మరణతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.



కోస్గిలో..



కృష్ణాలో..



మద్దూరులో రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఊట్కూరులో ఆలయంలో యజ్ఞం చేస్తున్న భక్తులు



మక్తల్‌లో..

వైభవంగా విగ్రహాల ప్రతిష్టాపన



మరికల్‌లో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

మరికల్: మండలంలోని చిత్తనూర్ ఎర్రగుట్టపై నిర్మించిన నూతన రామాలయాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు పూజలు అందుకున్న గణపతి, సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను వేద మంత్రాలతో ఆలయంలో అయోధ్య ముహుర్తానికి ప్రతిష్టాపన చేశారు. అలాగే ధ్వజస్తంభం ప్రతిష్టాపన చేసిన తర్వాత భక్తులకు శ్రీరాముడి దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, బీజేపీ జాతీయ నాయకురాలు డీకే. అరుణ, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

ధన్వాడ: మండలంలోని మందిపల్లిలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో సోమవారం భక్తిశ్రద్ధలతో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టాపించారు. అలాగే ధ్వజస్తంభం ప్రతిష్టాపన చేసిన తర్వాత భక్తులకు శ్రీరాముడి దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మాజీ మంత్రి డీకే. అరుణ తదితరల ప్రజాప్రతినిధులు విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను హాజరైయ్యారు.



ధన్వాడలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

విజ్ఞాన మేళాలో మెరిసిన 'మౌంట్‌బాసిల్' విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండల పరిధిలోని మౌంట్‌బాసిల్ పాఠశాల విద్యార్థులు వి/జ్ఞాన మేళాలో సత్తా చాటారు. ఈ నెల 20న ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా మేళా నిర్వహించగా ప్రాజెక్టుకు ఇద్దరు, సెమినార్‌కు ఒకరు ఎంపికయ్యారు. వీరిలో సాయిచంద్రశేఖర్, వాసవ్, అక్షర ఉన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సోమవారం పాఠశాల యాజమాన్యం అభినందించింది. వీరు ఈనెల 23, 24 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు.

మక్తల్ అభివృద్ధికి అన్నివిధాలా కృషి



11వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మున్సిపాలిటీ పరిదిలోని వార్డులకు తగిన ప్రాధాన్యత ఇస్తానని, పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మక్తల్ 11వ వార్డుల్లో పర్యటించి కాలనీలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సమస్యలు, తాగునీటి పైపులైన్ లీకేజీ, రోడ్లు, తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను ఇంటి వద్దకు వచ్చే మున్సిపాలిటీ ట్రాక్టర్లలో వేర్వేరుగా వేయాలని, ఎట్టి పరిస్థితుల్లో ఇంటి పరిసరాలు, వీధి చివర్లలో పారబోయవద్దని సూచించారు. ప్రధాన కూడళ్లను త్వరలో అభివృద్ధి చేస్తానని, సీసీ రోడ్లు లేని కాలనీల్లో వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చూస్తానని, మిగతా వార్డుల్లోనూ ప్రాధాన్యతను బట్టి సరిపడా నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు విధిగా పనులు చేపట్టాలన్నారు. కమిషనర్ బాల్‌రాంనాయక్, ఏఈ నాగశివ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో రోటీమేకర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐకేపీ ద్వారా మహిళలకు స్వయం ఉపాధికోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్న, చిన్న వ్యాపారాలు చేపట్టి ఉపాధి పొందొచ్చునని తెలిపారు. గ్రామానికి చెందిన నర్సింగమ్మ ఏర్పాటుచేసిన రోటీ మేకర్ షెడ్‌ను ప్రారంభించారు. ఎంపీపీ ఎల్కోటి లక్ష్మీ, సర్పంచ్ శాంతమ్మ, ఏపీఓ నిర్మల, సీసీ సుగుణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఈనెల 20, 21 తేదీల్లో జరిగిన ఖేలో ఇండియా మహిళల కిక్‌బాక్సింగ్ పోటీల్లో ఆర్‌కే స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించారు. వీరిలో వివిధ విభాగాల్లో సత్తాచాటిన యామిని నాయుడు, వర్షిని, కావ్యశ్రీ, సారిక, నవ్య, సాయిసృజన ఉన్నారు. వీరిని జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రవి కుమార్, కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ తదితరులు సోమవారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

దుస్తుల పంపిణీ



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని శ్రీఆదిఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం పంచాయతీ కార్మికులకు వింజామూర్ మాజీ సర్పంచ్ కుమ్మరిరాములు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టిసారించాలి



కోయిల్‌కొండ: గ్రామపంచాయతీల అభివృద్ధిపై మండలాధికారులు దృష్టి కేంద్రీకరించాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీఓ నజీర్‌హైమద్, వ్యవసాయాధికారి రాంపాల్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలను ప్రశ్నించడమే నాస్తికత్వం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సాంఘికపరమైన అసమానలతను ప్రశ్నించడమే నాస్తికత్వమని ఆ సమాజం జిల్లా గౌరవ అధ్యక్షుడు మైత్రియాదయ్య అన్నారు. సోమవారం స్థానికంగా సమాజం కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లడారు. నాస్తికత్వాన్ని బలోపేతం చేసేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. గుంటూర్ జిల్లా మంగళగిరిలో వచ్చేనెల రెండో శనివారం, ఆదివారాల్లో జాతీయ నాస్తిక మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాల్మీకి మహార్షి విగ్రహావిష్కరణ

నారాయణపేట రూరల్: మండలంలోని బైరంకొండలో వాల్మీకి మహార్షి విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో జలాదివాసం, ధాన్యాదివాసం తదితర పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపన అనంతరం మహార్షి విగ్రహానికి అభిషేకం, అర్చన, హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభంశివకుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సదాశివరెడ్డి వేర్వేరుగా హాజరై పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు, బోయకులస్తులు పాల్గొన్నారు.



హారతి ఇస్తున్న ఎమ్మెల్యే, మాజీ డీసీసీ అధ్యక్షులు

ముగిసిన పంచాయతీల బడ్జెట్‌పై గ్రామసభలు



భూనీడ్‌లో నిర్వహించిన గ్రామసభ

మద్దూరు: 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీలో ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు తదితర వాటిపై సోమవారం మండల స్థాయి అధికారులు గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. మద్దూరు, కొత్తపల్లి మండలాల్లోని అచ్చంపల్లి, అల్లీపూర్, అప్పిరెడ్డిపల్లి, భీంపూర్, భూనీడ్, చెన్వార్, చాపస్‌చెరువుతాండా, చంద్ర్యానాయక్‌తాండా, చెన్నారెడ్డిపల్లి, దమ్‌గాన్‌పూర్, దుప్పట్‌గట్ గ్రామాల్లో ఈ సభలు నిర్వహించారు. ఈ సంవత్సరంలో పంచాయతీలకు వచ్చే నిధులను ప్రధాన్యత క్రమంలో ఏ విధంగా ఖర్చు చేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు ఎంపీఓ విజయలక్ష్మి తెలిపారు. ఆయా గ్రామల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్లలో ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్న సరోజమ్మకు టీపీసీసీ అధికారప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ రూ.10వేలు అందజేశారు. సోమవారం వారి నివాసానికి వెళ్లి సరోజమ్మ యోగక్షేమాలను తెలుసుకుని మెరుగైన వైద్య చికిత్సలకు సహకరిస్తామని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. ఆయన వెంట అరుణ్‌కుమార్, కృష్ణకాంత్, మన్మోహన్, శ్రీకాంత్, రంజిత్, సీమోన్, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా హాజీమాలంగ్ బాబా ఉర్సు

అమరచింత: మండలంలోని మస్తీపురం గుట్టలపై వెలిసిన సయ్యద్ షా హాజీమాలంగ్ బాబా ఉర్సు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొబ్బరికాయలను, మలీదాను నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం కందూర్లకు పొటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకునే భక్తులు ఈసారి అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్టాపన ఉండటంతో దర్గా పరిసరాల్లో జంతుబలిని నిషేధించారు. భక్తులు సైతం స్వచ్ఛందంగా కందూర్లను వాయిదా వేసుకుని దర్గా షరీఫ్‌లో ప్రత్యేక ఫాతెహా కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. ఉత్సవాల్లో మతసామరస్యం వెల్లివిరిసిందని దేశంలో నివసించే ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలుగుతున్నారని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు, ఉర్సుకు హాజరైన భక్తులు

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

అమరచింత: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం అందించేందుకు డీఎంఆర్‌ఎం ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్ తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు సోమవారం అల్పాహారం అందించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్యాం, సుశీల, వైదూర్య, శారద పలువురు పాల్గొన్నారు.



అల్పాహారం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు